

● యాపల్‌గూడ సమీపంలో రేణుక సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు సేకరించిన స్థలం ఇదే..



● సరైన పరిహారం చెల్లించాలంటూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న బాధిత రైతులు

అడుగడుగునా ఆటంకాలు!

- జిల్లాలో భారీ పరిశ్రమల ఏర్పాటుకు ప్రయత్నాలు
- సీసీఐ పునరుద్ధరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలుమార్లు చర్చలు
- సాధ్యం కాదని తేలిపోవడంతో తెరపైకి కొత్తగా రేణుక సిమెంట్ పరిశ్రమ
- నాలుగేళ్ల క్రితమే భూములు కొనుగోలు చేసిన కంపెనీ యాజమాన్యం
- ప్రజాభిప్రాయ సేకరణను చేపట్టకుండానే గత ప్రభుత్వం అనుమతి
- సరైన పరిహారం చెల్లించాలంటూ బాధిత రైతుల ఆందోళనలు, నిరసనలు
- పరిశ్రమ ఏర్పాటుపై మళ్లీ అయోమయ పరిస్థితులు

ఆదిలాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ పరిశ్రమల ఏర్పాటుకు ఏళ్ల తరబడి ఎన్నో ప్రయత్నాలు జరుగుతున్నా అడుగడుగునా ఆటంకాలే ఎదురవుతున్నాయి. 25ఏళ్ల క్రితమే మూతబడిన సిమెంట్ పరిశ్రమను (సీసీఐ) పునరుద్ధరించేందుకు ముమ్మర ప్రయత్నాలు జరిగాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలుమార్లు చర్చలు జరిపినా ప్రయోజనమే లేకుండా పోయింది. అయినా సీసీఐని పునరుద్ధరించడం సాధ్యంకాదని తేలిపోవడంతో గత ప్రభుత్వ హయాంలోనే కొత్తగా రేణుక సిమెంట్ పరిశ్రమ తెరపైకి వచ్చింది. నాలుగేళ్ల క్రితమే పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన భూములను సంబంధిత కంపెనీ యజమాన్యం కొనుగోలు చేసింది. ఆదిలాబాద్‌రూరల్ మండలం యాపల్‌గూడ గ్రామ సమీపంలో 107.31 ఎకరాల భూమిని రేణుక సిమెంట్ యజమాన్యం రైతుల నుంచి సేకరించింది. కానీ పరిశ్రమను ఏర్పాటు చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పరిశ్రమ ఏర్పాటుకు మళ్లీ ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇప్పటికే ముడిఖనిజం కోసం భూములను సేకరించేందుకు అధికారులు నోటిఫికేషన్‌ను కూడా విడుదల చేశారు. కానీ ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణను చేపట్టకుండానే పరిశ్రమ ఏర్పాటుకు గత ప్రభుత్వ హయాంలో అనుమతులు ఇవ్వడం గందరగోళ పరిస్థితులకు దారి తీస్తోంది. కొన్నేళ్లుగా పరిహారం చెల్లించాలంటూ రైతులు ఆందోళనలు, నిరసనలు చేపడుతు వస్తున్నారు. తాజాగా రేణుక సిమెంట్ పరిశ్రమ బాధిత రైతులు కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగి సమస్యను పరిష్కరించాలంటూ డిమాండ్ చేయడం చర్చనీయాంశంగా మారింది. రైతుల సమస్యలను పరిష్కరించిన తర్వాతనే పరిశ్రమను ఏర్పాటు చేయాలంటూ రైతులు డిమాండ్ చేయడం అధికార వర్గాల్లో మళ్లీ అయోమయ పరిస్థితులకు దారి తీస్తోంది.

664.21 ఎకరాల స్థలం గుర్తింపు..

రేణుక సిమెంట్ పరిశ్రమకు అవసరమైన ముడి ఖనిజాన్ని సేకరించేందుకు అధికారులు మొత్తం 664.21 ఎకరాలను గుర్తించారు. ఇందులో 515.24 ఎకరాల భూ సేకరణకు పరిహారాన్ని చెల్లించేందుకు సంబంధిత రైతులకు నోటీసులు జారీ చేశారు. సర్వే నెంబర్ 20, 27, 30, 82, 83లలో నుంచి భూమిని సేకరించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో అసైన్డ్, పట్టా భూములు ఉన్నట్లు గుర్తించారు. ప్రస్తుతం ఈ భూముల మార్కెట్ విలువ ఎకరాన రూ.2.20 లక్షలు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. కానీ బయట మార్కెట్ విలువ ప్రకారం ఎకరాన రైతులకు రూ.8.29 లక్షలను చెల్లించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం. వాస్తవానికి ఎకరాన రూ.7.15 లక్షలు రైతులకు చెల్లించాల్సి ఉండగా కలెక్టర్ రాజర్షిషా ప్రత్యేక చొరవ తీసుకొని రైతులకు న్యాయంజరిగే విధంగా మరికొంత అదనంగా చెల్లించేందుకు అధికారులు సిద్ధమైనట్లు తెలుస్తోంది. అనుకున్నట్లుగానే భూసేకరణ ప్రక్రియ పూర్తయితే పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం అన్ని రకాల అనుమతులను ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. సీసీఐని ప్రత్యామ్నాయంగా రేణుక సిమెంట్ పరిశ్రమను ఏర్పాటు చేస్తే ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి.

ఎకరాన రూ.50లక్షల డిమాండ్..

రేణుక సిమెంట్ పరిశ్రమకు అవసరమైన భూసేకరణలో ఎకరాన రూ.50లక్షల పరిహారాన్ని ఇవ్వాలంటూ రైతులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే భూమిని కోల్పోయిన రైతు కుటుంబాలకు ఇంటికో ఉద్యోగాన్ని కల్పించాలని కోరుతున్నారు. లేదా భూమికి బదులు మరోచోట భూములను కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. రైతుల డిమాండ్లను పరిష్కరిస్తేనే సిమెంట్ పరిశ్రమకు అవసరమైన భూములను ఇచ్చేందుకు సిద్ధమని రైతులు స్పష్టం చేస్తున్నారు. దీంతో పరిశ్రమ ఏర్పాటుపై మళ్లీ అనుమానాలు, అయోమయ పరిస్థితులకు దారి తీస్తోంది. గతంలోనే రేణుక సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన భూములను ఇచ్చిన రైతులు ధర్నాలు, ఆందోళనలు చేపట్టారు. తమకు గతంలో ఇచ్చిన పరిహారం కంటే అధిక మొత్తంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే అధికారులు నిర్ణయించిన పరిహారానికి రైతులు చెబుతున్న పరిహారానికి ఎలాంటి పొంతన లేకుండానే పోయింది. ముడి ఖనిజాన్ని సేకరించేందుకు రైతులు భూములు ఇచ్చేందుకు ముందుకు రాక పోవడంతో పరిశ్రమ ఏర్పాటు మరింత ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది.

ఆందోళనకు సిద్ధమవుతున్న రైతులు..

పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన భూ సేకరణకు అధికారులు నోటీసులు ఇవ్వడంతో ఆయా గ్రామాల రైతులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని రామాయి, యాపల్‌గూడ, రాములుగూడ, యశ్వంత్‌గూడ, మత్తడిగూడ, కొత్తగూడ, రాంపూర్, అనుకుంట మొత్తం ఎనిమిది గ్రామాల రైతులు సమస్యల పరిష్కారానికి పట్టుబడుతున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల రైతులు రేణుక సిమెంట్ పరిశ్రమ బాధిత రైతు పోరాట సమితి పేరిట ఆందోళనకు దిగుతున్నారు. సమస్యల పరిష్కారానికి పోరాడేందుకు ప్రత్యేక కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా అధికారులకు అందించారు. సకాలంలో సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనను చేపడతామని హెచ్చరిస్తున్నారు. ఇప్పటి వరకు పరిశ్రమ ఏర్పాటు, భూసేకరణపై సంబంధిత సిమెంట్ పరిశ్రమ కంపెనీ రైతుల నుంచి అభిప్రాయ సేకరణను చేపట్టక పోవడంపై తప్పుబడుతున్నారు.

ప్రజలకు.. మెరుగైన వైద్యం అందించండి

● కలెక్టర్ రాజర్షిషా

● బోథ్ ఆసుపత్రి, కస్తూర్బా పాఠశాలల తనిఖీ



బోథ్ ఆసుపత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్



ఇచ్చోడలో మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్

బోథ్, ఆగస్టు 28 : బోథ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రితో పాటు కస్తూర్బా పాఠశాలను కలెక్టర్ రాజర్షిషా బుధవారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతిగదిని తిరిగి రోగులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్రప్రసాద్‌ను ఆసుపత్రిలో ప్రతిరోజు రక్తపరీక్షలు నిర్వహిస్తున్నారా, రోగులకు భోజనం పెడుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. కాగా రోగులకు ఆసుపత్రిలో అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్న అనంతరం ఆసుపత్రిలోని ఓపీ రికార్డులను పరిశీలించారు. రక్తపరీక్షల రికార్డులో తప్పులు ఉన్నాయని, తప్పులు దొరలకుండా పరిశీలించాలని డాక్టర్‌కు సూచించారు. అన్ని గదులలో వసతులు ఎలా ఉన్నాయనే విషయమై ఆయా గదులలో ఉన్న రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యాధుల భారిన పడకుండా చర్యలు తీసుకోవాలని వైద్యసిబ్బందికి సూచించారు. అనంతరం కస్తూర్బా పాఠశాలలో పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీజీ డీవో ఉదయశ్రీ, ప్రిన్సిపాల్ విలిత, ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమేష్ రావులను పాఠశాల నిర్వహణపై అడిగి తెలుసుకున్నారు. కస్తూర్బా పాఠశాలలో గణితం ఉపాధ్యాయులు లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రిన్సిపాల్ వివరించారు. ఉపాధ్యాయులు లేనందున టీవీ ప్రోగ్రాం ద్వారా విద్యార్థులకు అవగాహన కలిగించాలన్నారు. ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలలో సరైన మూత్రశాలలు, మరుగుదొడ్లు లేవని వివరించగా నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

● 30న ప్రారంభం కానున్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

బోథ్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఈనెల 30న ప్రారంభించనున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరగనున్నందున అధికార యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ రాజర్షిషాతో పాటు జాయింట్ కలెక్టర్ శ్యామలదేవితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన భవనంలోని వసతులను పరిశీలించారు. కార్యాలయం ముందు పరిశుభ్రంగా ఉంచాలని వెనుక ఉన్న పిచ్చిమొక్కలను తొలగించాలని ఎంపీడీవో జీవన్‌రెడ్డికి సూచించారు. అంతేగాక అక్కడే ఉన్న సబ్‌రిజిస్ట్రార్‌ను రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన వివిధరకాల రిజిస్ట్రేషన్‌లపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అవసరమైన వసతులను ఏర్పాటు చేసుకోవాలని, అందుకుగాను 50 శాతం నిధులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సుభాష్‌చంద్ర, గ్రామ పంచాయతీ ఈవో అంజయ్య, డిప్యూటీ తహసీల్దార్ భూమయ్య, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

● నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

ఇచ్చోడ : నాణ్యతా ప్రమాణాలలో రాజీ పడకుండా మీ హోటల్‌కు వచ్చే ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని పాతబస్టాండు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడుతూ.. బ్యాంకు రుణం 3లక్షల 10 వేల వచ్చాయని నాణ్యమైన ఆహారాన్ని అందించడంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా చూడాలన్నారు. హోటల్ ముందుస్థానంలో పెద్దఫ్లెక్సీ, హోటల్ లోపల రేట్‌చార్జ్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ నిధులకు సంబంధించి ఇప్పటివరకు ఎంత ఖర్చు చేశారు. ఏమేం వస్తువులు కొనుగోలు చేశారు. అందరి హోటల్‌కు మీ హోటల్‌కు మీరిచ్చే ప్రత్యేకత ఏంటి అంటూ.. లబ్ధిదారులైన మహిళాగ్రూప్ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్యాంటిన్ వాతావరణం అందంగా ఉండేలా చూడాలన్నారు. అనంతరం క్యాంటిన్ సభ్యుల ఆహ్వానం మేరకు క్యాంటిన్‌లో మహిళా శక్తి గ్రూప్ సభ్యులు తయారుచేసిన తేనేటి విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో సాయన్న, డిప్యూటీ తహసీల్దార్ రమేష్, ఐకేపీ ఏపీఎం దయాకర్, సీసీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మీ శ్రేయస్సు కోరే వారికి అందించండి...

ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు

మీ ఆత్మీయులలో.. మీ సహోద్యోగులలో... మీ కుటుంబ సభ్యులలో...

ఎవరైనా రిటైర్ అవుతున్నారా ?

అలాంటి వారు తమ విధి నిర్వహణలోని అనుభవాలు, సలహాలు, సూచనలు ఇచ్చి మీ అభివృద్ధికి మార్గదర్శకులై ఉంటారు. అయితే వారికి తీపి గుర్తుగా, మీ అమూల్యమైన కానుకగా శుభాభివందనలు తెలుపాలనుకుంటున్నారా! అయితే ఇప్పుడు ఆంధ్రజ్యోతి దినపత్రిక ద్వారా మీ ఆత్మీయులకు ప్రకటనలతో వారి ఆనందాన్ని మరింత రెట్టింపు చెయ్యండి.

అందుకు మా ప్రకటనల ప్రతినిధి మీ అందుబాటులోనే ఉన్నారు.



ఆంధ్రజ్యోతి

అందిస్తుంది సులువైన మార్గం ఉద్యోగ విరమణ ప్రకటనలకు

25%

ఆదిలాబాద్

9985411291

నిర్మల్ : 8096677672

హాస్టల్‌లో డెంగ్యూపై కదిలిన యంత్రాంగం

● వైద్య సిబ్బందిపై డిప్యూటీ డీఎంహెచ్‌వో ఆగ్రహం

● పలుచోట్ల తనిఖీలు



విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

తలమడుగు, ఆగస్టు 28 : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బీసీ వసతిగృహంలో పదోతరగతి చదువుతున్న సాయితేజ విద్యార్థికి డెంగ్యూ జ్వరం వ్యాపించి ఇంటికి వెళ్లారు. అదే విధంగా హాస్టల్‌లో ఉంటున్న ఇతర విద్యార్థులకు చర్మ వ్యాధులు సోకి నానా ఇబ్బందులు పడుతున్నారు. మరికొంత మంది విద్యార్థులకు జలుబు, దగ్గు అవస్థలు పడుతున్నారని, విషయం తెలుసుకున్న జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో, డాక్టర్ సాధన బుధవారం ఆకస్మికంగా హాస్టల్‌లో తనిఖీచేసి వైద్యసిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ హైస్కూల్‌ను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు.

● అప్రమత్తమైన అధికారులు...

భోథ్ : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ విద్యార్థి పల్లవికి డెంగ్యూవ్యాధి సోకడంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. 500పై చిలుకు విద్యార్థులు చదివే ఈ కళాశాలలో డెంగ్యూవ్యాధి సోకడంతో అప్రమత్తమయ్యారు. విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి రావడంతో తక్షణమే వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. దీంతో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. కాగా డెంగ్యూ వ్యాధిన పడిన విద్యార్థిని ఈ నెల 11న ఆమె స్వగ్రామమైన ఉట్నూర్ వెళ్లడం జరిగిందని, ఆ తరువాత 18న బోథ్ కళాశాలకు వచ్చిందని కళాశాల వర్గాల వారు పేర్కొంటున్నారు. సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో బుధవారం జిల్లా వైద్య అధికారి డాక్టర్ కృష్ణ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వ హించారు.

అత్యవసర మందులు ఉంచాలి..

ఉట్నూర్ : రోగులకు కావాల్సిన అత్యవసర మందులను అందుబాటులో ఉంచుకోవాలని ఏడీఎంహెచ్‌ఓ డాక్టర్ కుడిమెత మనోహర్ అన్నారు. మండలంలోని దంతన్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.



వడగామ్ వాగుదాటి జెండగూడ గ్రామానికి వెళుతున్న వైద్యులు

వాగు దాటి.. వైద్యం అందించిన సిబ్బంది



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఇంద్రవెల్లి, ఆగస్టు 28 : మండలంలోని వడామ్ గ్రామపంచాయతీ పరిధిలోని జెండగూడ గ్రామానికి మధ్యలో వాగు ఉండడంతో బుధవారం వైద్యాధికారి పూజిత వైద్య సిబ్బందితో కలిసి మండలంలోని జెండాగూడ గ్రామాన్ని సందర్శించి గర్భిణీ, బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించడంతో పాటు చిన్నారులకు ఇమునైజేషన్ టీకాలు అందించారు. ఈ సందర్భంగా వైద్యురాలు పూజిత మాట్లాడారు. వర్షాకాలంలో గ్రామీణ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు ఇంటి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. కాగా వాగు వద్ద కల్వర్టు లేకున్న వాగు దాటి తమ గ్రామానికి వచ్చి బాలింతలు, గర్భిణులకు, చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్యురాలు పూజిత, వైద్య సిబ్బందికి గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం విజయసుందరి, మైనబాయి ఉన్నారు.

తర్నంలో 20 నిమిషాల పాటు హెలీక్యాప్టర్ చక్కర్లు

● భయాందోళనకు గురైన తర్నం గ్రామవాసులు



చక్కర్లు కొడుతున్న హెలీక్యాప్టర్

నేరడిగొండ, ఆగస్టు 28 : ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం తర్నం గ్రామశివారులో ఓ హెలీక్యాప్టర్ ఆకాశంలో పదేపదే చక్కర్లు కొట్టింది. ఏకంగా 20 నిమిషాల పాటు హెలీక్యాప్టర్ ఆకాశంలో అటు.. ఇటు చక్కర్లు కొట్టసాగింది. దీంతో హెలీక్యాప్టర్ దారి తప్పిందా!? లేదా!? ఏదైనా సాంకేతిక లోపమా!? అన్న విషయం తెలియక గ్రామప్రజలు తీవ్రభయాందోళనకు గురయ్యారు. సాయంత్రం వేళ ఆకాశం మేఘా వృతమై ఉండడంతో హెలీక్యాప్టర్ ఎక్కడ కూలుతుందో అని జనం ఆందోళన చెందారు. ఆ తర్వాత హెలీక్యాప్టర్ అక్కడి నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్లిపోవడంతో.. స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

నవజాత శిశు మరణాల కట్టడికి చర్యలు

● కేంద్ర ఐసీఎంఆర్ బృందం పర్యటన

నార్నూర్, ఆగస్టు 28 : సంకల్ప్ పథకంలో భాగంగా నవజాత శిశు మరణాల కట్టడికి అన్ని చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ కేంద్ర బృందం సూచించింది. ఆదిలాబాద్ జిల్లా మొత్తంలో నవజాత శిశుమరణాల అధ్యయనం కోసం కేంద్ర రాష్ట్ర బృందాల సభ్యులు నార్నూర్ 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. వైద్యసిబ్బంది కలిసి కాన్పుల విభాగం మదర్‌కేర్ యూనిట్లను పరిశీలించారు. వైద్యులు రాంబాబు, జితేంద్రరెడ్డి, ప్రవీణ్, సిబ్బందితో ప్రత్యేక సమావేశమై ప్రాంత పరిస్థితి ప్రజలకు అందించే వైద్యంతో పాటు ఇతరాత్ర విషయాలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్ర రిమ్స్, ఉట్నూర్ నార్నూ ర్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పర్యటించారు. కార్యక్రమంలో కేంద్ర రాష్ట్ర ప్రతి నిధులు, వైద్యులు అమ్లిన్‌శుక్లా ఎస్తనిగైనాథన్, మనోజ్, మోహ ననుందరి, సత్యసాయిప్రసాద్, అంజలి, లక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్ దాస్, సత్యవ్వ, విలాస్ సిబ్బంది ఉన్నారు.

రిమ్స్ ఎదుట ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న పోలీసులు, మున్సిపల్ అధికారులు

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 28 : జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి ప్రధాన ద్వారం ఎదుట ఉన్న అక్రమ దుకాణాల షెడ్లను బుధవారం పోలీసులు, మున్సిపల్ అధికారులు తొలగించారు. రిమ్స్‌లోకి వాహనాలు వెళ్లి రావడానికి ఇబ్బందులు ఎదురవుతున్న దృష్ట్యా వాటిని తొలగించారు. ఈ సందర్భంగా డీఎస్పీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నందున షెడ్లను తొలగించినట్లు పేర్కొన్నారు. మరోసారి ఆక్రమిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. రిమ్స్‌డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, టూటౌన్ సీఐ కరుణాకర్ రావ్ పాల్గొన్నారు.

గిరి వికాసం పథకాలకు త్రీఫేస్ కరెంట్ : పీవో

ఉట్నూర్, ఆగస్టు 28 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన రైతుల భూములకు గిరివికాసం పథకం ద్వారా బోరుబావులకు త్రీఫేజ్ విద్యుత్ కనె క్షన్లు, మోటార్లు పైప్‌లైన్లు పనులను వెంటనే పూర్తిచేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా ఉమ్మడి జిల్లా అధికారులను ఆదేశించా రు. బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ పీవో క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. పీవో మాట్లాడుతూ అటవీ శాఖ నుంచి ఏమైనాసమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సేల్స్ రంగంలో రాణించాలనుకునే యువతి, యువకులకు మంచి అవకాశం

మీరు చేయవలసినదల్లా ఆంధ్రజ్యోతి దినపత్రికకు చందాదారులను చేర్పించటమే

ఆసక్తి, ఉత్సాహముగల అభ్యర్థులకు సేల్స్ రంగంలో... మెళుకువలు నేర్పించి తగిన శిక్షణ ఇవ్వబడును.

- బుక్ చేసిన కాపీ ఒక్కింటికి రూ. 200/- చొప్పున కమీషన్ ఇవ్వబడును.
- ప్రతి ఒక్కరు నెలకు సుమారు రూ. 20,000/- పైన ఆదాయం పొందే అవకాశం కలదు.

-: అర్హతలు :-

- 19 సం॥రాల నుండి 30 సం॥రాల మధ్య ఉండాలి
- తెలుగు అనర్గళంగా మాట్లాడగలగాలి.
- 10వ తరగతి పాస్ ఆపైన

-: పనిచేయవలసిన ప్రాంతం :-

ఆదిలాబాద్, ఇచ్చోడ డివిజన్ ప్రాంతాలలో

ఇంటర్వ్యూ తేది : 29-08-2024

సమయం : ఉ॥ 10.00 గం॥ల నుండి 2.00ల వరకు

-: సంప్రదించవలసిన చిరునామా :-

ఆంధ్రజ్యోతి కార్యాలయం

కలెక్టర్ ఆఫీస్ ఎదురుగా, ఆదిలాబాద్.

సెల్: 99854 03060, 93983 85917





చేప పిల్లలను వదిలిన అధికారులు

జైనథ్, ఆగస్టు28: మండల కేంద్రమైన జైనథ్ లక్ష్మీనారాయణ స్వామి చెరువులో జిల్లా మత్స్య శాఖ ద్వారా వచ్చిన చేప పిల్లలను బుధవారం జైనథ్ మండల పీహెచ్‌సీ డాక్టర్ నైనత, సీహెచ్‌ఓ అంజయ్యలు వదిలి పెట్టారు. ఈ కార్యక్రమంలో జైనథ్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఖాజాముజీబ్‌మొద్దిన్, ఏఎన్‌ఎంలు గంగాదేవి, గంగామణిలతో పాటు జైనథ్ గ్రామ మత్స్యకారులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

గుంభూషియా చేప పిల్లల విడుదల...

ఆదిలాబాద్ రూరల్ : ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సర్ఫరాజ్, సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం దస్నాపూర్ సబ్‌సెంటర్ ఏరియా లోని పద్మావతి కాలనీ, శంకర్ గుట్ట కాలనీలో నిల్వ ఉన్న నీటిలో లార్వాలను గుర్తించిగుంతలోని నీటిలో గుం భూషియా చేపపిల్లలను వదిలారు. జిల్లాలో డెగ్యూ జ్వరాలు విజృంభిస్తున్న తరుణంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాకర్ కృష్ణ, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ శ్రీధర్ ఆదేశాలతో గుంభూషియా చేప పిల్లలను వదిలి పెటారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ బొమ్మెత సుభాష్, నల్లఈశ్వర్ రెడ్డి, మలేరియా సిబ్బంది అనిల్, ఉదయ్, బాలాజీ, కార్తీక్ గౌడ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.


చేపపిల్లలను వదిలి పెడుతున్న వైద్య సిబ్బంది



'సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి'

నేరడిగొండ, ఆగస్టు 28 : మండలంలో అత్యధికంగా సభ్యత్వ నమోదు చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మడి భీంరెడ్డి అన్నారు.పార్టీ మండల అధ్యక్షుడు సాబ్లె సంతోష్‌సింగ్ అధ్యక్షతన బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యశాల సమావేశానికి ఆయన ఇన్‌చార్జిగా హాజరయ్యారు. బీజేపీ నాయకులకు పలు సూచనలు చేసిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా 12 కోట్ల సభ్యత్వాలతో బీజేపీ నిలిచిందని తెలిపారు. ఈ సారి జాతీయ పార్టీ గతం కంటే రెండింతలు చేసి 25కోట్ల సభ్యత్వాలు లక్ష్యాన్ని నిర్దేశించిందని అన్నారు. మండలంలోని ప్రతిపోలింగ్ బూత్ నుంచి 250 సభ్యత్వాలను చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించడం జరిగిందన్నారు. అనంతరం పోలింగ్ బూత్‌వారీగా ఇన్‌చార్జిలను నియమించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చ జిల్లా ఉపాధ్యక్షుడు గట్టునారాయణ, మండల ఉపాధ్యక్షుడు సాబ్లెకేవల్‌సింగ్, బీజేవైఎం జిల్లా నాయకుడు బాక్రెలక్ష్మణ్, కిసాన్‌మోర్చ మండల అధ్యక్షుడు చెట్‌పల్లి వెంకటేశ్, దళిత మోర్చ మండల అధ్యక్షుడు లింగంపల్లి సురేష్, ఓబీసీ మోర్చ మండల అధ్యక్షుడు రాంగుడ్ల సురేష్, మైనార్టీ మోర్చ మండల అధ్యక్షుడు అబ్దుల్‌జమీర్, మండల కార్యదర్శులు బాక్రెశేఖర్, జాదవ్‌భీంరావ్ తదితరులున్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి

● ఆదిలాబాద్ జిల్లా డీఐఓ డాక్టర్ నరేందర్‌రాథోడ్


పరిసరాలను పరిశీలిస్తున్న డీఐఓ నరేందర్‌రాథోడ్

జైనథ్, ఆగస్టు 28 : జైనథ్ మండలంలోని ఆయా గ్రామాలలో గల ప్రజలకు ఈ వర్షాకాలంలో ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని ఆదిలాబాద్ జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి నరేందర్‌రాథోడ్ అన్నారు. బుధవారం జైనథ్ మండలంలోని మేడిగూడ(ఆర్) హెల్త్‌సబ్‌సెంటర్‌ను డీఐఓ అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాతీయఆరోగ్య పథకం అమలు డ్రైడే కార్యక్రమాలను పరిశీలించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఐఓ వైసీ శ్రీనివాస్, గిమ్మా పీహెచ్‌సీ డాక్టర్ సూచల, ఏఎన్‌ఎంలు జ్యోతి, ఉజ్వలతో పాటు ఆశావర్కర్లు, మేడిగూడ గ్రామప్రజలు పాల్గొన్నారు.

'రోగులకు మెరుగైన వైద్యం అందించాలి'

నార్నూర్, ఆగస్టు 28 : వర్షాకాల సీజనల్ వ్యాధుల పట్ల రోగులకు మెరుగైన వైద్యం అందించాలని అడిషనల్ డీఎంహెచ్‌వో మనోహర్ అన్నారు. బుధవారం నార్నూర్ ప్రభుత్వ ఆసుపత్రి తాడిహత్నూర్ సబ్‌సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలను కార్యదర్శితో కలిసి చేయాలని సూచించారు. వారి వెంట వైద్యులు రాంబాబు, హెచ్‌ఈవో నాందేవ్, సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్, హెల్త్‌అసిస్టెంట్ కైలాస్ సింధూ, ఈశ్వర్, జవహర్ లాల్, ఆశాకార్యకర్తలున్నారు.













సహకార సంఘంలో జరిగిన అక్రమాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

బోథ్, ఆగస్టు 28 : బోథ్ మండల కేంద్రంలోని సహకార సంఘంలో జరిగిన అక్రమాలపై బుధవారం స్థానిక డైరెక్టర్‌లు జి.రాజు, నారాయణ, ఉమేష్‌లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బోథ్‌కు వచ్చిన జిల్లా కలెక్టర్‌ను కలిసి సహకార సమయంలో జరిగిన అక్రమాలపై వివరించారు. గతంలో సహకార సంఘంలో ఒకే రైతుకు ఒకే పాస్‌బుక్‌పైన నోడ్యూ సర్టిఫికెట్ లేకుండా బ్యాంకు రుణాలు ఇవ్వడం జరిగిందని, దీంతో రైతులు రుణమాఫీకి నోచుకోలేకపోతున్నారని వివరించారు. అంతేగాక ప్రతీనెల మూడు నెలలకు ఒకసారి జరగాల్సిన సమావేశాలు జరగకపోవడంతో ఇష్టారాజ్యంగా వివరించి రైతులను నిండా ముంచారని కలెక్టర్‌కు వివరించారు. స్పందించిన కలెక్టర్ రాజర్షిషా విచారణకు ఆదేశించి తగుచర్యలు తీసుకుంటామని వివరించారు.

'రుణమాఫీలో బ్యాంకర్ల కొర్రీలు'

బోథ్, ఆగస్టు 28 : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు పంట రుణాలు మాఫీ చేస్తూ వారి వారి అకౌంట్‌లో నిధులు జమ చేస్తున్నా కొంతమంది బ్యాంకర్లు రుణమాఫీ వర్తించకుండా కొర్రీలు పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. రుణమాఫీ కింద ఇచ్చే డబ్బులకు ముందుగానే మార్చినెలలో వసూలు చేసే వడ్డీని ఇప్పుడే వసూలు చేసున్నారని రైతులు వాపోతున్నారు. మరికొంత మంది బ్యాంకర్లు రైతు కుటుంబాల వారు తీసుకున్న డ్వాక్రా రుణాలకు సంబంధించిన వసూళ్లను ఇందులోనే తీసుకుంటున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. అంతేగాక కొంత మంది బ్యాంకర్లు ఓ అడుగు ముందుకు వేసి మహిళా సంఘాల సీసీల ద్వారా నో డ్యూ సర్టిఫికెట్ తీసుకురావాలని పేర్కొంటున్నట్లు పలు రైతులు వాపోతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఈ విషయంలో తగు చొరవ చూపించాల్సిన అవసరం ఉంది.

వివాహిత అదృశ్యం

భీంపూర్ , ఆగస్టు 28 : వివాహిత అదృశ్యం అయిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే భీంపూర్ మండలం తాంసి (కె) గ్రామానికి చెందిన ఆత్రం గంగుబాయి (32) అనే వివాహిత భర్త ఆత్రం సందీప్ అదే గ్రామానికి చెందిన మరోమహిళతో గత 8 సంవత్సరాల నుంచి వివాహేతర సంబంధం కొనసాగుతోంది. ఈ క్రమంలో మంగళ వారం భార్య, భర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో సందీప్ భార్య గంగు బాయిని కొట్టడంతో ఆమె అదే రోజు సాయంత్రం ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. తండ్రి మాడవి బాగువండ్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహ్మద్ కలీం తెలిపారు.

అమరులకు నివాళులు

ఆదిలాబాద్ అర్బన్, ఆగస్టు 28 : విద్యుత్ రంగాన్ని ప్రైవేట్‌పరం చేయడానికి 2000 సంవత్సరంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం యత్నించిందని దీనికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ముగ్గురు అమరులయ్యారని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. బుధవారం సుందరయ్య భవనంలో విద్యుత్ అమరవీరుల సంస్మరణసభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించి ఘన నివాళులర్పించారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ విద్యుత్‌రంగాన్ని ప్రైవేట్ పరం చేస్తున్న సమయంలో వ్యతిరేక ఉద్యమం కొనసాగిందన్నారు.కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆశన్న, లింగా చిన్నన్న, అగ్గిమల్ల స్వామి తదితరులున్నారు.

ఘనంగా ఉట్టి పండుగ

ఉట్నూర్, ఆగస్టు 28 : శ్రీకృష్ణాష్టమి ఉత్సవాలు పురస్కరించుకొని విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో ఉట్టి పండుగను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మెయిన్‌రోడ్డులో ఉన్న సతీష్‌టైలర్స్ సమీపంలో ఉట్టిని ఏర్పాటు చేశారు. డీఎస్పీ నాగేందర్, అధ్యక్షులు రామిని నాగన్న ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉట్టిని పగలగొట్టిన విన్నర్‌ప్రైజ్ రూ.7116 సతీష్ టైలర్ ఆధ్వర్యంలో రన్నర్స్ రెండు టీంలకు ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున సన్‌షైన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఉట్నూర్ ఇంద్రవెల్లి వారు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గోపాల్‌సెంట్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులు క్రీడల్లో రాణించాలి : పీవో ఖుష్బుగుప్తా


జిల్లా క్రీడల అధికారి పార్థసారథిని సన్మానిస్తున్న పీవో

ఉట్నూర్, ఆగస్టు 28 : గిరిజన విద్యార్థులు క్రీడల్లో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. పిల్లల్లో సంపూర్ణ మూర్తితత్వం పెంపొందించాలంటే వారిని ప్రతి రోజు ఆడనివ్వాలని అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఐటీడీఏ ఆధ్వర్యంలో బుధవారం ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. గిరిపుత్రుల్లో సహజసిద్ధంగా ఉన్న క్రీడానైపుణ్యాన్ని వెలికితీసి సానబెడతామని చెప్పారు. ఆర్చరీ అకాడమిని ఉట్నూర్‌లో నెలకొల్పి జాతీయస్థాయిలో విలు విద్య క్రీడాకారులను తయారు చేస్తామని పేర్కొన్నారు. గిరిజన క్రీడాపాఠశాల విద్యార్థులకు అవసరమైన క్రీడాదుస్తులు పరికరాలను పంపిణీ చేస్తామని తెలిపారు. గిరిజన విద్యార్థులు జాతీయస్థాయిలో రాణించడం హర్షణీయమని, వారిని అన్నివిధాలుగా ప్రోత్సహిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రస్థాయి గిరిజన క్రీడలను ఈ యేడాది ఉట్నూర్‌లో నిర్వహించేందుకు సన్నాహాలు చేయాలని కోరారు. అంతకు ముందు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఏపీవో వసంత్‌రావుతో కలిసి క్రీడాదినోత్సవం పరుగులో పాల్గొన్నారు. జాతీయస్థాయిలో రాణించిన 66 మంది క్రీడాకారులను, ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న కోచ్‌లు, పీడీలు క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. ఈ నెలలో పదవీ విరమణ చేయనున్న సీనియర్ పీఈటీ రాములును సన్మానించారు. కార్యక్రమంలో ఏసీఎంవో జగన్ జిల్లా గిరిజన క్రీడా అధికారి కోరెడ్డి పార్థసారథి, బి.మీనా రెడ్డి, భుక్యరమేష్, జీవరత్నం, పవర్‌లక్ష్మణ్, రాథోడ్ శ్రీనివాస్, రవీందర్, మధుసూదన్, జీవంతరావు, సునంద్, శివ, శేఖర్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

● గిరిజన బడుల్లో ఇంగ్లీష్ లిటరసీ

గిరిజన ఆశ్రమ ప్రాథమిక బడులలో చదివే 3 నుంచి 5వ తరగతిల విద్యార్థులకు ఆంగ్లభాష పఠనం ఉచ్చారణ అవగాహన నైపుణ్యాలు పెంపొందించేందుకు అన్ని పాఠశాలల్లో ఇంగ్లీష్ లిటరసీ కార్యక్రమంను విభాప్ సంస్థ సహకారంతో అమలు చేసున్నామని ఐటీడీఏ పీవో పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొమురంభీం ప్రాంగణంలోని పీఎంఆర్‌సీ సమావేశ మందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన ఆదిలాబాద్ నిర్మల్ జిల్లాల ప్రాథమిక స్థాయి తరగతులు బోధించే ఉపాధ్యాయులకు ఒకరోజు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో మాట్లాడారు.

విద్యార్థులకు ప్రాథమికస్థాయి నుంచి బోధించు ఉపాధ్యాయులు చాలా విలువైన వారిని ప్రతి విద్యార్థిపై ప్రైమరీ టీచర్ ప్రభావం అధికంగా ఉంటుందని ప్రతి ప్రతి ప్రైమరీ టీచర్ విద్యార్థి క్రియాశీలంగా ఉండే విధంగా సృజనాత్మకంగా సులువైన రీతిలో బోధించాలన్నారు. ఈ విద్యా సంవత్సరం అంతం వరకు ప్రతి పాఠశాలలో గుణాత్మకమైన మార్పులు తీసుకువచ్చే విధంగా బోధించాలని, మంచి బోధన గుణాత్మక మార్పు విద్యార్థుల స్థాయిని పెంచే ఉపాధ్యాయులను గుర్తించి వారికి ప్రత్యేక బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఏపీవో వసంతరావు,ఏసీఎంఓ జగన్, జీసీడీఓ చాయా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లో ఘనంగా తీజ్ ఉత్సవాలు


తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న మహిళలు

ఆదిలాబాద్ అర్బన్, ఆగస్టు 28 : బంజార సంస్కృతి సాంప్రదాయాలు ఎంతో గొప్పవని ఎమ్మెల్యే పాయలశంకర్ అన్నారు. ఆదిలాబాద్‌లోని న్యూహౌజింగ్‌బోర్డులో నిర్వహించిన తీజ్ ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ జోగుప్రేమేందర్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బంజారాల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అదే విధంగా పట్టణంలో బంజారాభవన్ కోసం ప్రభుత్వానికి విన్నవిస్తానని పేర్కొన్నారు. అదే విధంగా పట్టణంలో సేవలాల్‌చౌక్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. హిందు సంస్కృతి సాంప్రదాయాలను ప్రతి ఒక్కరు కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. పంచభూతాలను పూజించడం ద్వారానే భారతదేశంలో ఎలాంటి దుష్పరిమాణాలు జరగడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు పవన్, రఘుపతి, ముకుందరావు, వేదవ్యాస్, రిమ్స్ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగుల ధర్నా


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 28 : సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలో మహార్యాలీ, నిరసన దీక్ష చేపట్టారు. ఇందులో భాగంగా కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. మృతి చెందిన సమగ్ర ఉద్యోగులకు ఎక్స్ గ్రేషియ ప్రకటించాలన్నారు.

బంగారు నగల చోరీ

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 28 : ఆదిలాబాద్ పట్టణంలోని భుకాపూర్ కాలనీలో బుధవారం తెల్లవారుజామున చోరీ ఘటన చోటు చేసుకుంది. ఇద్దరి దుండగులు రెండు గంటల ప్రాంతంలో ఇంట్లోకి చొరబడి బంగారు నగలు ఎత్తుకెళ్లారు. అదే సమయలో ఇంటి యజమాని జాహెద్ రావడంతో దుండగులు గోడ దూకి పారిపోయారు. ఇంటి యజమాని వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, వేలి ముద్రల నిపుణులు ఆధారాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావ్ తెలిపారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 28 : రాజ్యాంగంలో పొందుపరిచిన చట్టాలు, వాటి పనితీరుపై విద్యార్థి దశ నుంచే అవగాహన పెంపొందించుకోవాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య విద్యార్థులకు సూచించారు. ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఉబికి వస్తున్న జలధార


గుట్టలోంచి వస్తున్న జాలధారలు

గుడిహత్నూర్, ఆగస్టు 28 : మండలంలోని గుడిహత్నూర్, సీతాగొంది మధ్య జాతీయ రహదారి పక్కన ఉన్న గుట్టలోంచి జలధారలు ఉబికి వస్తున్నాయి. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా గుట్టలను తవ్వి రహదారి నిర్మించారు. ప్రతి వర్షాకాలంలో రోడ్డుకు ఇరువైపుల ఉన్న గుట్టలోంచి జలధారలు బయటకు వస్తుండడంతో జాతీయ రహదారిపై వెళుతున్న వాహనదారులు ఆసక్తిగా సెల్‌ఫోన్‌లో ఫొటోలు బంధిస్తున్నారు. సెల్ఫీలు దిగుతూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొందరు వాహనాలు ఆపి బాటిళ్ళు క్యాన్‌లలో నింపుకుంటున్నారు. స్వచ్ఛమైన నీరుగా భావిస్తూ దాహం వేసిన వారు దాహార్తి తీర్చుకుంటున్నారు.

కాంగ్రెస్‌తోనే జిల్లా అభివృద్ధి సాధ్యం

ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి

ఆదిలాబాద్, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జిల్లా అభివృద్ధి సాధ్యమని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం ప్రజాసేవభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ రూరల్ మండలం అర్లి(టీ) గ్రామానికి చెందిన మాజీసర్పంచ్ అయటి వినోద్, పలువురు వార్డుసభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే పట్టణంలోని 15వ వార్డు సుందరయ్య కాలనీకి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలను చూసి పెద్దసంఖ్యలో పార్టీలో చేరడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ అంటేనే బడుగు బలహీన వర్గాల పార్టీ అన్నారు. ఇచ్చిన మాట ప్రకారమే రూ.2లక్షల రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా మరికొంత మందికి రుణమాఫీ జరగాల్సి ఉందన్నారు. ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సెప్టెంబర్ 17 నుంచి కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేస్తామన్నారు. కాంగ్రెస్ నేతలు పాలకులు కాదని సేవకులుగా పనిచేస్తామన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలను పాతరేసి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలన్నారు. కార్యక్రమంలో గిమ్మా సంతోష్, సతీష్, నర్సింగ్, ఆవుల వెంకన్న, రాంకుమార్, జాఫర్ అహ్మద్, ఎంఎ షకీల్, డేరా కృష్ణారెడ్డి తదితరులున్నారు.

కలెక్టరేట్ ఎదుట దివ్యాంగుల ధర్నా


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దివ్యాంగులు

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 28 : దివ్యాంగుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షులు మెస్రం నగేష్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదురుగా సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు సబ్సిడీ రుణాలు అందించాలన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టులు దివ్యాంగులకు కేటాయించాలని కోరారు.

గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఖానాపూర్ సీఐ సైదారావు

దస్తురాబాద్, ఆగస్టు 28 : గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని ఖానాపూర్ సీఐ సైదారావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మండలంలోని అన్ని గ్రామాల గ్రామ పెద్దలు, యువకులు, డీజే యజమానులతో బుధవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి అన్నారు. పూజ సమయంలో తక్కువ మోతాదులో కలిగిన స్పీకర్లు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోను డీజేలకు అనుమతి లేదని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై రాహుల్ గైక్వాడ్, గ్రామ పెద్దలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

భారతీయ జనతా పార్టీ మండల సభ్యత్వ నమోదు


మాట్లాడుతున్న బీజేపీ దళితమోర్చా నాయకులు

సోన్ (నిర్మల్), ఆగస్టు 28 : సోన్ మండల కేంద్రంలో భారతీయ జనతాపార్టీ మండల సభ్యత్వ నమోదు కార్యశాల వేద పాఠశాల భవనంలో నిర్వహించడం జరిగింది. ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్ హాజరై మాట్లాడుతూ... ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ అవతరించిన భారతీయ జనతాపార్టీ ప్రతి ఆరు సంవత్సరాలకు ఒకసారి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జాతీయస్థాయి నుంచి గ్రామీణ స్థాయి వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. పార్టీ సంస్థ గత ఎన్నికకు జాతీయ స్థాయిలో, రాష్ట్రస్థాయిలో, మండల స్థాయిలో ఈ సభ్యత్వం ద్వారా ఎన్నికల నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజల్లో భారతీయ జనతా పార్టీపై ఆదరణ ఉందని ఈ సభ్యత్వ కార్యక్రమాన్ని ఒక పండుగ వాతావరణంలా చేపట్టాలని మండల నాయకత్వానికి, బూత్ స్థాయి కార్యకర్తలకు పిలుపునివ్వడం జరిగింది. ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జాతీయ స్థాయిలో జాతీయ అధ్యక్షుడు నడ్డా సెప్టెంబరు ఒకటవ తేదీన ప్రారంభిస్తారని, రాష్ట్రస్థాయిలో కేంద్ర మంత్రివర్యుల బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సెప్టెంబరు మూడవ తేదీన ప్రారంభిస్తారని ఆ రోజున పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నాలుగు రకాల చేపట్టడం జరుగుతుంది. 8800002024 నెంబర్‌కు మిస్డ్‌కాల్ ఇవ్వడం వల్ల సభ్యత్వం జరుగుతుందని, క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం వల్ల సభ్యత్వం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్క కార్యకర్త సభ్యత్వం నమోదు చేసుకుని దేశ ధర్మ రక్షణలో భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు మార గంగారెడ్డి, హరీష్ రెడ్డి, మేల అశోక్, నరేష్, శ్రీనివాస్, రాజేశ్వర్, సంతోష్, అమృత్, బాలకృష్ణ, సవీన్, పోశెట్టి, ప్రశాంత్, మనోహర్, గంగాధర్, రవి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

రైతు పురోగతితోనే దేశం అభివృద్ధి చెందుతుంది

● వెంకట సాయి రైతు ఉత్పత్తి సంస్థ ప్రారంభోత్సవంలో నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



కలెక్టర్‌కు నాగలి బహూకరిస్తున్న రైతు

పెంబి, ఆగస్టు 28 : ఆధునిక వ్యవసాయ పద్ధతులతో పంటలు సాగుచేయడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని, రైతు పురోగతితోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన శ్రీ వెంకట సాయి రైతు ఉత్పత్తి సంస్థ కార్యాలయాన్ని రిబ్బన్ కట్ చేసి, జ్యోతి వెలిగించి ప్రారంభించారు. సంస్థ కార్యకలాపాలు, ఎరువులు, విత్తనాల సరఫరా, పంటల దిగుబడి, మార్కెటింగ్ సౌకర్యాలపై జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్ కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ... ఆధునిక వ్యవసాయ పద్ధతులతో పంటలు సాగు చేసి, రైతులు అధిక దిగుబడులు సాధించాలన్నారు. రైతులు అభివృద్ధి చెందినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని మారుమూల ప్రాంతమైన పెంబి మండల కేంద్రంలో 350 మంది రైతుల సమిష్టి కృషితో ఉత్పత్తిదారుల సంస్థను స్థాపించడం అభినందనీయమని అన్నారు. ఈ సంస్థ ద్వారా 10 గ్రామ పంచాయతీలలోని 18 హెబిటేషన్లలో దాదాపు 4 వేల మంది రైతులకు ఉపయోగపడుతుందని అన్నారు. సంస్థకు అవసరమైన వసతులు కల్పించడంతో పాటు రైతుల అభివృద్ధికి వ్యవసాయ శాఖ అధికారులు సలహాలు, సూచనలు అందించాలని సూచించారు. సంస్థ అభివృద్ధికి జిల్లా యంత్రాంగం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని, రైతులు అవకాశాలను సద్వినియోగం చేసుకొని లాభాలు సాధించాలని కోరారు. ప్రతి 3 నెలలకు ఒకసారి సంస్థ పురోగతిని పరిశీలించి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. అంతకుముందు సంస్థ అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి, పుప్పాల వంకర్ మాట్లాడుతూ... రైతుల మేలు కోసం మారుమూల ప్రాంతంలో 350 మంది సభ్యులతో సంస్థను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. భవిష్యత్తులో సంస్థ అభివృద్ధికి చేపట్టనున్న కార్యకలాపాలను ఆయన వివరించారు. అనంతరం మహిళా సభ్యురాలు సోంబాయిని కలెక్టర్ శాలువాతో సన్మానించారు. కలెక్టర్ బొమ్మ చిత్ర పటం గీసిన పుప్పాల నవిత, మోహన్ అనే రైతు నాగలిని కలెక్టర్‌కు బహూకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో విజయలక్ష్మి, నాబార్డ్ డీడీ వీరభద్రుడు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రమణ, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీవో రమాకాంత్, మాక్స్ అధ్యక్షుడు సల్ల రామేశ్వర్ రెడ్డి, ఎఫ్‌పీసీ అధ్యక్షుడు పుప్పాల శంకర్, తాజా మాజీ సర్పంచ్ శేఖర్ గౌడ్, సుధాకర్‌గౌడ్, పుప్పాల రవి, బి. చిన్నయ్య, ఐదు వెంకటేష్, సల్ల రాములు, సల్ల దేవేందర్, కుర్మ మహేందర్, రాజేందర్, కృష్ణారెడ్డి, గుగ్గిళ్ల భూమేష్, అధికారులు, రైతులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యకళాశాల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే


వైద్య కళాశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, ఆగస్టు 28: ప్రభుత్వ వైద్యకళాశాల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం ప్రభుత్వకళాశాల నిర్మాణ పనులను వైద్యఆరోగ్యశాఖాధికారి తుకారాం భట్, పర్యవేక్షకుడు చెన్నకేశవులుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతుల వసతిగృహానికి సంబంధించి పూర్తి వసతులు కల్పించాలన్నారు. 100మంది మహిళా విద్యార్థినులకు గదులు, మూత్రశాలలు, ఇతర సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. భవనంలోని అన్నిఅంతస్తులలో పూర్తిస్థాయి లో సౌకర్యాలు ఉండేలా పర్యవేక్షించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. విద్యార్థినుల సంరక్షణలో భాగంగా అనుమతి లేని వారు ఎవరూ లోనికి రాకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్య నభ్యసించే మహిళా వైద్యవిద్యార్థినులకు సరిపడా మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు. వైద్యకళాశాలకు సంబంధించిన తరగతి గదులు, ప్రయోగశాల, ఇతర అన్ని ఏర్పాట్లు వేగంగా చేయాలని ఆదేశించారు.

విద్యా ప్రమాణాలను మెరుగుపర్చాలి..

విద్యాప్రమాణాలను మెరుగు పరిచే విధంగా కృషిచేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా విద్యాశాఖాధికారి అశోక్‌తో కలిసి అన్నిప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలలు, కళాశాలల ప్రతినిధులతో విద్యాప్రమాణాలు పెంపొందించడంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు గుణాత్మక విద్యనందిస్తూ విద్యాప్రమాణాలను మెరుగుపరిచే విధంగా విద్యాసంస్థలు కృషిచేయాలన్నారు. యుడైస్2024-25 విద్యాసంవత్సరంలో నైతిక విలువలతోకూడిన విద్యాబోధనలు చేస్తూ విద్యాప్రమానాలు మెరుగుపరిచి జిల్లాను మంచిస్థానంలో ఉంచేలా సమష్టిగా పని చేయాలన్నారు. పాఠశాలల భద్రతపై చర్యలు తీసుకోవాలని, మౌలిక వసతులు కల్పించాలని, ప్రతి అంశంలోని వివరాలు నమోదు చేయాలని తెలిపారు. జిల్లాలో 1200 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయని అన్ని విద్యాసంస్థలు పూర్తివివరాలతో నివేదిక రూపొందించాలన్నారు.

కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగుల ధర్నా

ఆసిఫాబాద్ రూరల్, ఆగస్టు 28: సమస్యలను పరిష్కరించాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అంతకుముందు పట్టణంలోని శివాజీ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే వందరోజుల్లో మిమ్మల్ని పిలిపించి చాయ్‌తాగే లోపు మీసమస్యలు పరిష్కరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు.

కూలిన ప్రహరీ

● పట్టించుకోని ఐటీడీఏ ప్రభుత్వ శాఖ అధికారులు

నార్నూర్, ఆగస్టు 28 : మండల కేంద్రం ఆశ్రమ పాఠశాలలో గత సంవత్సరం పాఠశాల వెనుక భాగం ఉన్న ప్రహరీగోడ కూలింది. దీంతో విద్యార్థులు భయాందోళనలో ఉన్నారు. పాఠశాలలో 150 విద్యార్థులు ఉంటారు. ఎనిమిది గదులు ఉన్నాయి. వర్షాకాలం కావడంతో విషపురుగు పాములు కుక్కలు, తేలు, ఇతర జంతువులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. చీకటిలో విద్యార్థులు కాలకృత్యాలకు బయటకు రావాలన్న ఇబ్బందిగా ఉంది. విద్యార్థులకు సరైన రక్షణ లేకుండా పోయింది. అనుకోకుండా ఏదైనా సంఘటన జరిగితే దానికి బాధ్యులు ఎవరు అనే ప్రశ్న వచ్చింది. ఐటీడీఏ అధికారుల పనితీరుపై గ్రామ ప్రజలు చర్చించుకుంటున్నారు. ఆశ్రమ పాఠశాల సిబ్బందికి గ్రామస్థులు కూడా చాలా సార్లు సమస్య పరిష్కరించాలని కోరారు. వెంటనే అధికారులు స్పందించి ప్రహరీగోడ నిర్మాణం చేయాలని ప్రాంతవాసులు కోరుతున్నారు.

రోడ్డుపైనే లారీల పార్కింగ్

కాగజ్‌నగర్, ఆగస్టు 28: కాగజ్‌నగర్ ఎస్పీఎంకు కర్రలోడ్‌తో వచ్చిన లారీలు రోడ్డుపైనే నిలిపేస్తుండడటంతో పట్టణవాసులు ఇబ్బందులు పడుతున్నారు. అసలే ఇరుకు రోడ్లు. ఆపై లారీల పార్కింగ్‌తో తీవ్ర ఇబ్బందిగా ఉందని పట్టణవాసులు పేర్కొంటున్నారు. రాజీవ్‌గాంధీ చౌరస్తా నుంచి లారీచౌరస్తా, లారీ చౌరస్తా నుంచి బజరంగ్ చౌరస్తా వెళ్లేమార్గంలో రోడ్డుపైనే లారీలను నిలిచి ఉంటున్నాయి. ఈ మార్గంలోనే పాఠశాలలుండటంతో విద్యార్థులు ఇంటికి చేరే వరకు తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంటోంది. ఇప్పటికైనా పోలీసులు, అధికారులు స్పందించి లారీలను రోడ్డుపైనిలపకుండా చూడాలని ప్రజలుకోరుతున్నారు.

కవితకు బెయిల్‌పై సంబరాలు

కాగజ్‌నగర్/రెబ్బెన, ఆగస్టు 28: ఢిల్లీ లిక్కర్ స్కాం లో కేసులో బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవితకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేయటంతో బుధవారం రెబ్బెన, కాగజ్‌నగర్‌లో బీఆర్ఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీచేశారు. అనంతరం టపాసులు పేల్చారు. రెబ్బెనలో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీధర్, దుర్గారావు, అశోక్,అప్పు, కాగజ్ నగర్‌లో బీఆర్ఎస్ సిర్పూరు నియోజకవర్గ ఇన్‌చార్జీ లెండుగురే శ్యాంరావు, సలీం, ముస్తాఫీజ్, మినాజ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశాలకు నోటిఫికేషన్‌జారీ

కాగజ్‌నగర్ టౌన్, ఆగస్టు 28: అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2024-25సంవత్సరానికి గానూ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ అయినట్లు ఎస్‌కేఈ డిగ్రీ కళాశాల కో-ఆర్డినేటర్ దత్తాత్రేయ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులు బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో చేరేందుకు ఆన్‌లైన్ ద్వారా ఈనెల 31లోగా దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. సంబంధిత ఫీజు కూడా ఆన్‌లైన్ ద్వారా చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే రెండు సెట్ల జిరాక్స్ కాపీలు, పాస్‌ఫొటోతోపాటు ఆన్‌లైన్ హార్డ్ కాపీ సమర్పించాలన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికేట్లను కళాశాలలో వెరిఫికేషన్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 98663 98678 నంబర్‌లో సంప్రదించాలని వివరించారు.

నీటికుంటలో పడి మహిళ మృతి

చింతలమానేపల్లి, ఆగస్టు 28: కూలి పనులకు వెళ్తున్న క్రమంలో ఫిట్స్‌రాగా నీటికుంటలో పడి చింతలమానేపల్లి గ్రామానికి చెందిన బంటు రుకుంబాయి(50) మృతిచెందింది. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. చింతలమానేపల్లి గ్రామానికి చెందిన రుకుంబాయి గ్రామసమీపంలో వ్యవసాయపనికి వెళ్తోంది. ఈ క్రమంలో మార్గ మధ్యలో ఒక్కసారిగా ఫిట్స్ రాగా ప్రమాదవశాత్తు నీటికుంటలో పడింది. కూలికి వస్తానని ఇంకా రాకపోవడంతో రుకుంబాయి కోసం భర్త చంద్రయ్య వెతకగా దారిలోఉన్న నీటికుంటలో మృతిచెంది ఉండడాన్ని గమనించాడు. అనంతరం పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై నరేష్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతురాలిభర్త చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.5 కనిష్ఠం 24.6

నిర్మల్ జిల్లా వార్తలు
8
గురువారం 29 ఆగస్టు 2024

ఎయిడెడ్ స్కూళ్ల మనుగడ ప్రశ్నార్థకం



- టీచర్ల నియామకాల నిలిపివేతతో ఎయిడెడ్ పాఠశాలల ఉనికిపై నీలినీడలు
- మూడు నాలుగు నెలలకోసారి టీచర్లకు వేతనాలు
- ఉమ్మడి జిల్లాలో 26 స్కూళ్ల పరిస్థితి దయనీయం

నిర్మల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఎయిడెడ్ స్కూల్స్ మనుగడ రోజురోజుకు ప్రశ్నార్థకమవుతుంది. రాష్ట్ర ప్రభు త్వం ఎయిడెడ్ స్కూల్స్ విషయంలో నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్న కారణంగా మరికొద్ది రోజుల్లోనే ఈ స్కూల్స్ కనుమరుగయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. 2003 సంవత్సరం నుంచి ఎయిడెడ్ స్కూళ్లలో కొత్త టీచర్లు, స్టాఫ్ నియామకాలు చేపట్ట రాదంటూ అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశించింది. ఈ ఆదేశాల కారణంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఎయిడెడ్ స్కూళ్లలో నియామకాలు జర గడం లేదు. ఎయిడెడ్ స్కూల్స్‌ను ఆదుకుంటామంటూ గతంలో సీఎం కేసీఆర్ పలుసార్లు హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు ఆ హామీ నెరవేరక పోవడంతో ఎయిడెడ్ స్కూల్స్ మనుగడ రోజురోజుకు నీరుగారుతోందం టున్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 400లకు పైగా ఎయిడెడ్ స్కూల్స్ ఉన్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 26 ఎయిడెడ్ స్కూళ్లు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో నుంచి 13 హైస్కూల్స్ కాగా మరో 13 ప్రైమరీ స్కూల్స్ ఉండడం గమనార్హం. అయితే ప్రభు త్వం ఎయిడెడ్ స్కూల్స్ విషయంలో పెద్దగా శ్రద్ధ చూపకపోతుండడంతో ఆ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవు తున్నారు. అలాగే ప్రభుత్వ టీచర్లతో సమానంగా ఎయిడెడ్ స్కూళ్లలో పనిచేస్తున్న టీచర్లు విధులు నిర్వహిస్తున్నప్పటికీ వారికి సమన్యాయం దక్కడం లేదంటున్నారు. వీరికి 101 పద్దు కింద కాకుండా నాన్‌ప్లాన్ గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద వేతనాలు చెల్లిస్తుండడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అంటున్నారు. ఈ కుబేర్ సిస్టం అమలవుతున్నప్పటి నుంచి వీరికి నాలుగైదు నెలలకోసారి జీతాలు వస్తున్నాయని అంటు న్నారు. రాష్ట్రంలోని కొన్ని జిల్లాలో మార్చి నెల నుంచి ఇప్పటి వరకు కూడా ఎయిడెడ్ స్కూల్ టీచర్లకు జీతాలు అందలేదని పేర్కొం టున్నారు. జిల్లా కేంద్రంలోని ఎయిడెడ్ స్కూళ్లలో 400మందికి పైగా స్టూడెంట్స్ ఉన్నప్పటికీ కేవలం ఏడుగురు టీచర్లు మాత్రమే కొనసాగుతు న్నారు. ఎయిడెడ్ స్కూళ్లలో ప్రతీఏటా టీచర్లు రిటైర్మెంట్ అవుతు న్నప్పటికీ కొత్త నియామకాలు లేకపోవడంతో ఉన్న టీచర్లే అన్ని సబ్జెక్టు లను బోధించాల్సి వస్తుందంటున్నారు. కొత్తగా టీచర్ల నియామకాలు జరగకపోతుండడంతో అడ్మిషన్లు కూడా ఆశించిన మేరకు రావడం లేదం టున్నారు. ఇలా ఓవైపు టీచర్లు మరోవైపు స్టూడెంట్స్ లేకపోవడం అలాగే ప్రభుత్వం నుంచి నిర్వహణ గ్రాంట్ విడుదల కాకపోతుండడంతో ఈ ఎయిడెడ్ పాఠశాలలన్నీ మూసివేత వైపు అడుగులేస్తున్నాయంటున్నారు.


జిల్లా కేంద్రంలోని ఎయిడెడ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రాంగణం

టీచర్ల నియామకం, గ్రాంట్ మంజూరు కీలకం

ఎయిడెడ్ స్కూళ్ల మనుగడను కాపాడేందుకు ప్రభుత్వం చొరవ తీసు కోవాలని కోరుతున్నారు. ముఖ్యంగా ఈ స్కూళ్లలో టీచర్లు, స్టాఫ్ నియా మకాలను పునరుద్ధరించాలని కోరుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాల కులు ఈ స్కూళ్ల నిర్వహణపై నిర్లక్ష్యం చేశారని అప్పటి ప్రభుత్వ హ యాంలోనే నియామకాలు నిలిపి వేశారని పేర్కొంటున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా అదే పరిస్థితి కొనసాగుతోందన్న ఆరో పణలు వస్తున్నాయి. సీఎం కేసీఆర్ గతంలో ఎయిడెడ్ స్కూళ్లను కాపా డుతామంటూ భరోసా ఇచ్చారని ఆ భరోసా నిలుపుకోవాలని అంటున్నా రు. ముఖ్యంగా ఎయిడెడ్ స్కూల్స్‌కు మెయింటెనెన్స్ గ్రాంట్‌ను పున రుద్ధరించాలని కోరుతున్నారు. సబ్జెక్టుల వారీగా టీచర్ పోస్టులను మం జూరు చేయడమే కాకుండా నియామకాలను చేపట్టి వారందరినీ రెగ్యు లరైజ్ చేయాలని సూచిస్తున్నారు. మన ఊరు - మన బడి పథకం కింద ఈ పాఠశాలలను చేర్చాలని పలువురు కోరుతున్నారు.

ప్రస్తుత టీచర్ల సమస్యలపై నిర్లక్ష్యం


ఎయిడెడ్ స్కూళ్లలో పని చేస్తున్న టీచర్ల సమస్యల పైన ప్రభు త్వం నిర్లక్ష్యం వహిస్తుందన్న ఆరోపణలున్నాయి. వారికి 101 పద్దు కింద వేతనాలు అందించాలని, ట్రాన్స్‌ఫర్లు, ప్రమోషన్లు ఇవ్వాలని కోరుతున్నారు. అలాగే జీపీఎఫ్, మెడికల్ రీయం బర్స్‌మెంట్, హెల్త్ కార్డు సౌకర్యాన్ని కల్పించాలని ఎయిడెడ్ స్కూల్ టీచర్లు కోరుతున్నారు. తమకు ప్రతీ నెల సక్రమంగా జీతాలు అందించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

స్వరాష్ట్రంలోనూ మాపై వివక్ష కొనసాగుతోంది..



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాలనలో మాపై వివక్ష కొనసాగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే తమ సమస్యలన్నీ పరిష్కారమవుతాయని సంబరం పడ్డాం. అయితే సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ కూడా నెరవేరడం లేదు. తమకు మూడు నెలలకోసారి జీతాలు అందుతున్నాయి. జీపీఎఫ్, మెడికల్ రీయం బర్స్‌మెంట్ సౌకర్యం కూడా లేదు. అలాగే కొత్త రిక్రూట్మెంట్లు లేకపోవడంతో పాఠశాలలు మూసి వేతకు దగ్గర పడుతున్నాయి. అన్ని వర్గాల ఉద్యో గులను ఆదుకుంటున్న సీఎం కేసీఆర్ ఎయిడెడ్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలి.

- చొక్కారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎయిడెడ్ టీచర్స్ గిల్డ్



కుస్లి బెల్టు షాపులో గొడవ

- ఒకరిపై కేసునమోదు

నర్సాపూర్(జి), ఆగస్టు 28 : మండలంలోని కుస్లి గ్రామంలోని బెల్టుషాపులో గొడవ జరగడంతో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై మాన్‌సింగ్ తెలిపారు. గత నాలుగు రోజుల క్రితం గ్రామానికి చెందిన సుధాకర్ అదే గ్రామానికి చెందిన రాకేష్‌ను కర్రతో తలపై దాడి చేయడంతో కుటుంబ సభ్యు లు ఆసుపత్రిలో చేర్పించారు. తల్లి చింతకింది లక్ష్మి తన కుమారుడు రాకేష్‌ను పాత కక్షలను దృష్టిలో ఉంచుకొని తలపై కర్రతో దాడి చేశాడని బుధవారం ఫిర్యాదు చేయడంతో 118(1), 296 బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై మాన్‌సింగ్ తెలిపారు.

గోవధశాల ఏర్పాటును నిలిపివేయాలి

- తహసీల్దార్ కార్యాలయానికి తరలివచ్చిన మండల వాసులు

సారంగాపూర్, ఆగస్టు 28 : మండలంలని చించోలి(బి) పరిసర ప్రాంతాల్లో గోవధశాల ఏర్పాటును నిలిపివేయాలని బుధవారం తహసీల్దార్ కార్యాల యానికి పెద్ద ఎత్తున మండల వాసులతో పాటు పార్టీలకు అతీతంగా ఆయా పార్టీల నాయకులు తరలివచ్చి తహసీల్దార్ శ్రీదేవికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ నేపథ్యంలో వారు విలేకరులతో మాట్లాడుతూ... నిర్మల్ పరిసర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న దానిని చించోలి(బి) ఎక్స్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఏర్పాటును నిలిపి వేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ జిల్లా రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు నల్ల వెంకట్రామ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ, మాజీ ఎంపీపీ అట్ల మహిపాల్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు రాజ్‌మహ్మద్, శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ మాణిక్‌రెడ్డిలతో పాటు ఆయా పార్టీల నాయకులు రాంశంకర్‌రెడ్డి, మాధవ్‌రావు, బొల్లోజీ నర్సయ్య, చంద్రప్రకాష్‌గౌడ్, సాహెబ్ రావులతో పాటు బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు ఉన్నారు.

ఘనంగా ముథోల్ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు


ఎమ్మెల్యేను గజమాలతో సత్కరిస్తున్న బీజేపీ శ్రేణులు

భైంసా, ఆగస్టు 28: రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో బుధవారం ము థోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. బీజేపీ శ్రేణులు, ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ అభిమానులు, అనుచగర ణం ఆధ్వర్యంలో వేడుకలు ఉదయం నుంచి రాత్రి వరకు కోలాహలంగా జరి గాయి. వేడుకలలో భాగంగా బీజేపీ శ్రేణులు, అభిమానులు, అనుచరులు ఎమ్మె ల్యేను గజమాలతో సత్కరించారు. బీజేపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు ఎనుపోతు ల మల్లేశ్వర్ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అభిమా నులు ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. బీజే పీ సభ్యత్వ నమోదు కోఆర్డినేటర్ సుష్మారెడ్డి వివేకానంద నిరాశ్రిత బాలుర ఆ వాస కేంద్రంలో పండ్ల పంపిణీ కార్యక్రమం చేపట్టింది. వేదం విద్యా సంస్థల డై రెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు ఎమ్మెల్యే ముఖచిత్రంతో కూడిన మాస్కులను ధరించి వేడుక చేసుకున్నారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు స్థానిక ఏరియా ఆసుపత్రి ఐసీయూ వార్డు కోసం గాను ఐసీయూ బెడ్స్, జనరల్ బెడ్స్ తో పాటు ఇతర సామాగ్రిని బహూకరించారు.

ముథోల్ రూరల్, ఆగస్టు 28 : ముథోల్‌లో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు కోరి పోతన్న, మండల నాయకులు పాల్గొన్నారు.

బైక్, ట్రాక్టర్ ఢీ.. ఇద్దరి మృతి


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ నవీన్ కుమార్, ఎస్సై సందీప్

మామడ రూరల్, ఆగస్టు 28 : మండలంలోని తాండ్ర గ్రామ సమీపం లో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వాస్తాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు మృతి చెందారు. ఎస్సై సందీప్ తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వాస్తాపూర్ గ్రామానికి చెందిన ఆడెం శ్యామ్ రావు(47), ఆడెం సంతోష్(25)లు బైక్‌పై వెళ్తుండగా అతివేగంతో గ్రామం వైపు వెళ్తున్న ట్రాక్టర్ డ్రైవర్ వీరిని ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. వీరికి తీవ్రమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. బుధ వారం సంఘటన స్థలాన్ని సోన్ సీఐ నవీన్‌కుమార్ సందర్శించారు. శ్యామ్ రావు భార్య లక్ష్మీబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'ప్రతీ ఆడపిల్లకు సుకన్య సమృద్ధి యోజన పథకం అవసరం'

భైంసా రూరల్, ఆగస్టు 28 : మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో బుధవారం సుకన్య సమృద్ధి పథకం గురించి మిషన్ శక్తి జెండర్ జ్యోతి అవగాహనపరిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ తన ఆడపిల్లల గురించి సుకన్య సమృద్ధి యోజన పథకం చేయించాలని కోరారు. ప్రతి అమ్మాయికి పై చదువుల కోసం ఉపయోగపడుతుందని తెలిపారు. పోస్టల్ డిపార్ట్‌మెంట్ అధికారులు స్వామి, మౌనిక, జ్యోతి, మ హిళా సాధికారత బృందం, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సేల్స్ రంగంలో రాణించాలనుకునే యువతి, యువకులకు మంచి అవకాశం
మీరు చేయవలసినదల్లా ఆంధ్రజ్యోతి దినపత్రికకు చందాదారులను చేర్పించటమే
ఆసక్తి, ఉత్సాహముగల అభ్యర్థులకు సేల్స్ రంగంలో... మెళుకువలు నేర్పించి తగిన శిక్షణ ఇవ్వబడును.
- బుక్ చేసిన కాపీ ఒక్కింటికి రూ. 200/- చొప్పున కమీషన్ ఇవ్వబడును.
- ప్రతి ఒక్కరు నెలకు సుమారు రూ. 20,000/- పైన ఆదాయం పొందే అవకాశం కలదు.
-: అర్హతలు :-
- 19 సం॥రాల నుండి 30 సం॥రాల మధ్య ఉండాలి
- తెలుగు అనర్గళంగా మాట్లాడగలగాలి.
- 10వ తరగతి పాస్ ఆపైన
-: పనిచేయవలసిన ప్రాంతం :-
నిర్మల్, ఖానాపూర్, భైంసా డివిజన్ ప్రాంతాలలో
ఇంటర్వ్యూ తేది : 29-08-2024
సమయం : ఉ॥ 10.00 గం॥ల నుండి 2.00ల వరకు
-: సంప్రదించవలసిన చిరునామా :-
ఆంధ్రజ్యోతి కార్యాలయం
వెంకట్‌రావు Advocate, (Retd. P.P. House), ఇంద్రనగర్, పోస్టాఫీస్ లైన్, నిర్మల్.
సెల్: 9985403060

ఇథనాల్ పరిశ్రమతో ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం

- దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామస్థుల సమావేశంలో కలెక్టర్


ప్రత్యేక సమావేశానికి హాజరైన రైతులు


రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, ఆగస్టు 28 : ఇథనాల్ పరిశ్రమ వలన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల రైతులు, విద్యావంతులు, ప్రజలు, పరిశ్రమ ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఇథనాల్ పరిశ్రమ వలన ప్రజలకు ఎటువంటి నష్టం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. పరిశ్రమపై రైతులు, గ్రామస్తుల సందేహాలను అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ, నీటి పారుదల, అటవీ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, శాస్త్రీయంగా అధ్యయనం చేయాలని ఆదేశించారు. ఇటీవల ఆందోళన చేసిన వారి వాహనాలు జప్తు చేయడంతో పాటు పలువురిపై కేసులు నమోదు చేశారని గ్రామస్తులు కలెక్టర్‌కు విన్నవించారు. పోలీస్ శాఖ అధికారులతో చర్చించి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా కలెక్టర్ హామీ ఇచ్చారు. పరిశ్రమపై మహిళలు, రైతులు, విద్యావంతులు, యువత సందేహాలను, ప్రశ్నలను లిఖిత తహసీల్దార్ స్వాతికి అందించాలని సూచించారు. సందేహాలను శాస్త్రీయంగా పరిశీలించి, తదుపరి సమావేశంలో చర్చించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డివిజనల్ అటవీ శాఖ అధికారి షేక్ ఆదాం నాగిని భాను, డీఆర్‌వో భుజంగ్ రావు, డీపీవో శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, డీఎంహెచ్‌వో రాజేందర్, దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామస్తులు, రైతులు, విద్యావంతులు, యువత, కాలుష్య నియంత్రణ అధికారులు, ఇథనాల్ పరిశ్రమ ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వరుస దొంగతనాలకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్

- 150 గ్రాముల గంజాయి , 2 తులాల బంగారం, 20 తులాల వెండి నగల స్వాధీనం
- వివరాలను వెల్లడించిన డీఎస్పీ గంగారెడ్డి



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి, స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి

నిర్మల్ టౌన్, ఆగస్టు 28 : జిల్లాలో వరుసగా దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ గంగారెడ్డి వివరాలను వెల్లడించారు. హర్యానా రాష్ట్రానికి చెందిన మహమ్మద్ అబ్బాస్ అనే వ్యక్తి గత 15 సంవత్సరాల క్రితం నిర్మల్‌కు వచ్చి గాజులపేట్ కాలనీలో నివాసం ఏర్పరచుకుని ఇక్కడే స్థిరపడ్డాడు. కూరగాయల దుకాణంలో పని చేసుకుంటూ చిన్న చిన్న దొంగతనాలకు పాల్పడుతుండేవాడు. ఈ క్రమంలో ఇటీవల కిల్లా గుట్ట, సోమవార్‌పేట్, పింజారి గుట్ట, కురన్నపేట్‌లో గత ఏడాది అక్టోబరులో జల్సాలకు అల వాటుపడి దొంగతనాలను చేసే వాడు. దొంగతనం చేసి పోలీసులకు దొరకకుండా తప్పించు కుని తిరుగుతున్నాడు. క్లూస్ టీం సభ్యులు దొంగతనం చేసిన చోట్ల మహమ్మద్ అబ్బాస్ వేలిముద్రలు దొరకడంతో నిందితుడి కోసం పోలీసులు గాలించారు. ప్రత్యేక టీం నిర్మల్‌లో, హర్యా నా రాష్ట్రం, నాందేడ్ పోలీసులు సహకారంతో హర్యానా నుంచి ఇక్కడికి వచ్చి స్థిరపడిన వారందరినీ విచారించారు. అబ్బాస్ దొంగతనాలకు పాల్పడుతున్నాడని తెలుసుకొని చాకచక్యంగా పట్టుకుని ఇతని వద్ద నుంచి 150 గ్రాముల గంజాయి, 2 తులాల బంగారం, 20 తులాల వెండిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. జిల్లాలో గంజాయి విక్రయించే వారిపై, దొంగత నాలకు పాల్పడుతున్న వారిపై నిఘా ను పటిష్టం చేసి వీరిపై పూర్తిగా అడ్డుకట్ట వేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇంట్లో, దుకాణ సముదాయాల్లో సీసీ కెమె రాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. దొంగలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్య వహరించిన పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్సైలు రమేష్, సాయికృష్ణ, రవి, గోపి, నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ సౌకత్, కానిస్టేబుల్‌లను జిల్లా ఎస్పీ జానకి షర్మిల అభినందించారు.

గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

- ఏఎస్పీ అవినాష్ కుమార్



భైంసా రూరల్, ఆగస్టు 28 : భైంసా పట్టణం గ్రామీణ పోలీసుస్టేషన్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ అవినాష్ మాట్లాడు తూ... గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. గణేష్ ఉత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అందరూ కలిసికట్టుగా సోదర భావంతో సంతోషంగా గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలని సూచించారు. అదేవిధంగా యువకులు మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని తెలిపారు. గ్రామాల్లో ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినచో సొంత నిర్ణయాలు తీసుకోకుండా పోలీ సులకు సమాచారం అందించాలని కోరారు. గణేష్ మండపాల వద్ద సీసీ ఫుటేజ్‌ను నిర్వహించాలన్నారు ఎవరైనా అసంఘటిత చర్యలకు పాల్పడినచో చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఐ నైలు, ఎస్సై శ్రీనివాస్ యాదవ్, పోలీస్ బృందం, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, యువకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి అల్లోల


బాధిత కుటుంబ సభ్యులతో అల్లోల

సారంగాపూర్, ఆగస్టు 28 : మండలంలోని ధని, అడెల్లి గ్రామాల్లో ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిన బాధిత కుటుంబాలను బుధవారం మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట నాయకులు అల్లోల మురళీధర్‌రెడ్డి, ఐరా నారాయణరెడ్డి, మహిపాల్ రెడ్డి, మాధవ్‌రావు, రాజులు ఉన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి


ధర్నా చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 28 : జిల్లాలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహించే సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఆ సంఘం డిమాండ్ చేసింది. బుధ వారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కనీస భద్రత లే కుండా తాము విధులు నిర్వహిస్తున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యారంగంలో సమగ్ర శిక్షకులు కీలక పాత్ర పోషిస్తున్నామని తెలిపారు. గత, ప్రస్తుత ప్రభుత్వా లకు సమస్య విన్నవించినా ఫలితం చేకూరలే దన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కో రారు. ఉద్యోగ భద్రత, 10 లక్షల జీవిత భీమా, 5 లక్షల ఆరోగ్యబీమా వర్తింపజేయాలని కోరారు. 61 సంవత్సరా లు నిండిన వారికి 20 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్లు అందిం చాలని, మహిళా ఉద్యోగులకు 180 రోజుల ప్రసూతి సెలవు, మృతుల కుటుంబాలకు 15 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. అధ్యక్షుడు భూసారపు గంగాధర్, ప్రధాన కార్యదర్శి జి. రాజారత్నం పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన హిందూ యువవాహిని జిల్లా అధ్యక్షుడు రాము

భైంసా, ఆగస్టు 28 : హిందూ యువ వాహిని జిల్లా అధ్యక్షుడు రావుల రాము బుధవారం బీజేపీలో చేరారు. గత దశాబ్దానర కాలంగా హిందూ వాహినితో పాటు వి విధ అనుబంధ సంస్థల్లో పలు బాధ్యతలు నిర్వర్తించిన రావుల రాము ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటి ల్ సమక్షంలో బీజేపీలో చేరారు.స్థానిక ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రావుల రాము 100 మందికి పైగా తన అనుచరగణంతో బీజేపీ తీర్థం పుచ్చుకోగా ఎమ్మెల్యే రామరావ్ పాటిల్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాటి ల్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ సమర్థవంతుడు, క్రియాశీలక యువనేత. కార్యదీక్షపరుడు రావుల రాము బీజేపీలో చేరడం పార్టీకి కొండంత బలమ ని పేర్కొన్నారు. ఇందులో మున్సిపల్ కౌన్సిలర్లు తోట రా ము, గౌతం పింగ్లేతో పాటు పలువురు పాల్గొన్నారు.